క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

కార్మికుడి కుటుంబానికి..



కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్మికుడిగా పనిచేస్తూ మరణించిన కోటి నరసింహారావు కుటుంబానికి మినీ ట్రాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన గురువారం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మార్కెట్ కార్మిక సంఘాల ఐఎన్‌టీయూసీ ప్రతినిధి నున్నా మాధవరావు అధ్వర్యాన సంఘ ప్రతినిధులు ఎర్ర రాంరెడ్డి, వడ్డే వెంకన్న, షరీఫ్, వీరబాబు, పిట్టల రమేష్ తదితరుల బృందం నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంలో మృతుడి భార్య పుష్పావతికి ఆర్థిక సాయాన్ని అందించారు.

కిడ్నీ బాధితుడికి..

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామానికి చెందిన రాజా అనే వ్యక్తికి రెండు కిడ్నీలు దెబ్బతిని వైద్యం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈనేపథ్యాన ఆ బాధితుడికి తమ వంతు సాయం అందించాలని అదే గ్రామంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల మిత్ర బృందం రూ.3వేలను గురువారం అందజేశారు. ఆపరేషన్‌కు రూ.30 లక్షలు ఖర్చవుతుందని, నిరుపేద కుటుంబానికి దాతలు తమకు తోచిన సాయం అందించాలని కోరారు.

అన్నదానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని మధురానగర్ శ్రీసాయినాథ్ మందిర కమిటీ ఆధ్వర్యాన గురువారం అన్నం ఫౌండేషన్‌లో మందిరంలో హారతి పూజల అనంతరం అన్నదానం చేశారు. భక్తులు అందిస్తున్న విరాళాల ద్వారా ఒక గురువారం దేవాలయంలో, మరో గురువారం అన్నం ఫౌండేషన్‌లో అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగు విత్తనాలు

రఘునాథపాలెం: రఘునాథపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జీలుగు, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి ఇంటూరి భాస్కరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వ రాయితీపై పంపిణీ చేస్తున్న వీటి కోసం రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డును తీసుకెళ్తే జీలుగు (30 కేజీలు) ధర రూ.1,116లకు పొందొచ్చన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

ఖమ్మంమయూరిసెంటర్: బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ అన్నారు. గురువారం 46వ డివిజన్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించి, బడి బయట ఉన్న పిల్ల లను గుర్తించి బడిలో చేర్పించిన సందర్భంగా వైష్ణవి మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీరంగం సౌజన్య, ఝాన్సీ, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మనమే
వినోద	హరోమ్ హర
సాయిరాం	ఇంద్రాని ఎపిక్ 1
ఆదిత్య	రాజధాని రౌడీ
శ్రీనివాస	మహారాజ
సుందర్	లవ్ మౌళి

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	60	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	50		20
కాకర	70	చుక్కకూర	3
బీర	80		20
దొండ	30	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	110	గోంగూర	4
గోరుచిక్కుడు	50		20
క్యాబేజీ	30	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	26		20
ఆలుగడ్డ	36	కొత్తిమీర	1
చామగడ్డ	46		50
క్యారెట్	50	పుదీన	1
క్యాప్సికం	74		30

-ఖమ్మం వ్యవసాయం

కబ్జా స్థలాలన్నీ పేదలకు పంచుతాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలన్నింటినీ గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకోవడంతో పాటు అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెదతండా, చినతండా, వరంగల్ క్రాస్‌రోడ్, జలగంనగర్‌లలో నిర్వహించిన ప్రజల చెంతకే మీ శ్రీనన్న కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఇంటి స్థలం సమస్య ఎవరికీ రానీయకుండా ఉండాలని, కొద్ది రోజుల్లోనే పాలేరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. ఎలాంటి పైరవీలకు తావులేకుండా రాబోయే మూడేళ్లలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయ కుండా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని, అందులో భాగంగానే నేరుగా ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నట్లు చెప్పారు. మీఇంటి పెద్ద కొడుకుగా ప్రభుత్వ ఫలాలు అందించే బాధ్యత తనదేనని, గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు పంపిణీ చేయలేదని, ప్రస్తుత పాలనలో పేదలందరికీ లబ్ధి చేకూరేలా పాలన సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సీపీఐ నాయకులు కె.వెంకటరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన..

మండలంలోని సత్యనారాయణపురంలో గల కేజీబీవీ విద్యాలయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజన మెనూ, బోధన విధానంపై విద్యాలయ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని నాణ్యమైన విద్యా బోధన అందించాలని సూచించారు.

ఎట్టకేలకు ఆర్‌యూబీకి మోక్షం!

- మామిళ్లగూడెం- సారథినగర్ నడుమ సాఫీగా రాకపోకలు
- నెరవేరిన దశాబ్దాల నాటి కల



నిర్మాణం పూర్తయిన ఆర్‌యూబీ

ఖమ్మం రాపర్తినగర్: కొన్నేళ్లుగా ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న మామిళ్లగూడెం -సారథినగర్ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. ఖమ్మం మున్సిపల్ శాఖ, రైల్వే శాఖ సంయుక్త నిధులతో పదేళ్ల క్రితమే దీని నిర్మాణం చేపట్టినా.. స్థల సేకరణ విషయంలో జాప్యం జరిగిన విషయం తెలిసిందే. కాగా, జిల్లా మంత్రులు చొరవ తీసుకోవడంతో నిర్మాణ పనులు గత కొంతకాలంగా చురుకుగా కొనసాగాయి. ఆ తర్వాత కొన్ని రోజులు రైల్వే శాఖ, మున్సిపల్ శాఖ వారు ఇబ్బంది పెట్టడంతో పనులు నిలిచిపోయాయి. ఈనేపథ్యాన రైల్వే శాఖకు ఫిర్యాదులు రావడంతో మున్సిపల్ శాఖకు సహకరించి నిర్మాణం పనులు పూర్తయ్యేలా చొరవ చూపాయి.

పట్టాల వద్ద ప్రమాదాలు..

మామిళ్లగూడెం - సారథినగర్ మధ్య రైల్వే ట్రాక్ ఉండడంతో ఆ మార్గాన ప్రయాణించే వారు పట్టాలు దాటుతున్న క్రమంలో మృత్యువాత పడుతున్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకొని ఖమ్మం మున్సిపాలిటీ వారు రైల్వే అధికారులతో చర్చించి నిర్మాణానికి పూనుకున్నారు. గతంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన ఆ ప్రాంతవాసులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడడంతో బ్రిడ్జి నిర్మాణాన్ని కొన్నేళ్ల పాటు మూసివేశారు. ఆ తర్వాత దీనికి రోడ్డు మార్గం సాఫీగా ఉండడంతో నూతన రోడ్డు నిర్మించారు. దీంతో ప్రారంభానికి ముందే రాకపోకలు సాగిస్తుండడంతో ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, రైల్వే మూడవ లైన్ పనులు పూర్తయ్యే వరకు ఈ బ్రిడ్జిని అధికారికంగా ప్రారంభించే సూచనలు కనిపించడం లేదు.

మర్రి బావిని శుభ్రం చేయాలి



నిరసన తెలుపుతున్న స్థానికులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని 25వ డివిజన్‌లో గల మర్రి బావిని శుభ్రం చేయాలని స్థానికులు గురువారం నిరసన చేపట్టారు. కుమ్మరిబజార్ మర్రి చెట్టు సెంటర్‌లో ఉన్న మర్రి బావిలో చెత్తచెదారం పేరుకుపోయి మురికి కంపుతో అతి దుర్గంధం రావడంతో చుట్టుపక్కల నివసించలేని పరిస్థితి నెలకొందని, దోమలు పెరిగి విషజ్వరాలు రావడంతో పాటు ఇటీవల ఓ వ్యక్తి బోధకాలు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు, పాలకులు పట్టించుకొని తక్షణమే ఈ బావిని శుభ్రం చేయాలని కోరుతున్నారు.

గురుపౌర్ణమి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ హర్కారా బావి రోడ్ రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీకృష్ణ సాయి ఆశ్రమంలో నిర్వహించే 24వ గురుపౌర్ణమి వేడుకల ఆహ్వాన పత్రిక, పోస్టర్లను గురువారం ఆశ్రమ నిర్వహణ కమిటీ, పురోహితులు, భక్త బృందం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఆశ్రమ కమిటీ చైర్మన్ లగడపాటి రామారావు మాట్లాడుతూ.. జూలై 11 నుంచి 21 వరకు గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా భక్తులు శ్రీ షిర్డిసాయి ఏకాదశ దీక్షలు మాలధారణ చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి సిద్దంశెట్టి నాగమణి, ప్రతినిధులు చౌడవరపు మధుసూదన్ రావు, కొదుమూరి శ్రీనివాసరావు, నరహరి రమేష్‌కుమార్, కేతేపల్లి సంజయ్, మార్తా నరసింహారావు, బిజినేపల్లి సుధ్మన గుప్త, పాల్గొన్నారు.

'నీట్' అక్రమాలపై విచారణ జరిపించాలి



నిరసనలో పాల్గొన్న విద్యార్థులు, అకాడమీ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఖమ్మంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ ఆధ్వర్యాన విద్యార్థులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ బాధ్యులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దోషులపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించొద్దన్నారు. అలాగే, 1,563 మందికి తిరిగి పరీక్ష నిర్వహించాలనే నిర్ణయం హర్షణీయమని తెలిపారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీ

రఘునాథపాలెం: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలను ఎంఈఓ ఎం.శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. ఎనిమిదేళ్ల తర్వాత తెరుచుకున్న బూడిదంపాడు పాఠశాలను తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల నమోదు శాతం పెంచాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. ఆ తర్వాత మండలంలోని పుటానితండా, సూర్యాతండా పాఠశాలలను కూడా తనిఖీ చేసి ప్రవేశాల పెంపు, బోధనపై సూచనలు చేశారు.

పెరిగిన ధరల ఆధారంగా వేతనాలు పెంచాలి

రఘునాథపాలెం: పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం రఘునాథపాలెంలో సుతారి మేస్త్రీల అడ్డా దగ్గర కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఈ నెల 16వ తేదీన ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రగతి శీల భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యాన ఖమ్మం ఏరియా ఐదో మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హక్కుల సాధనకు భవిష్యత్‌లో ఉద్యమ నిర్మాణం కోసం నిర్వహించే ఐఎఫ్‌టీయూ ఖమ్మం ఏరియా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శంకర్ మేస్త్రి, నాగేశ్వరరావు, రాము, వెంకట్, బోడాలాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

నేలకొండపల్లి: వర్షం కారణంగా ప్రమాదవశాత్తు టిప్పర్ పల్టీ కొట్టగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన ఇది. మండలంలోని రాయగూడెం వద్ద జరుగుతున్న రహదారి నిర్మాణ పనులకు రాజారాంపేట నుంచి టిప్పర్ల ద్వారా మట్టిని సరఫరా చేస్తున్నారు. ఈక్రమంలో వర్షం పడడంతో రాయగూడెం-చెరువుమాదారం మధ్య మూలమలుపు వద్ద గురువారం సాయంత్రం టిప్పర్ పల్టీ కొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలై క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. దీంతో స్థానికులు ఆయనను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.

చెట్టును ఢీకొట్టిన కారు..

మండలంలోని మోటాపురం వీరన్నస్వామి దేవాలయం మీదుగా గురువారం వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ పంబ ఉదయ్‌కిరణ్‌కు గాయాలు కాగా, 108లో నేలకొండపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

యంత్రం తగిలి వ్యక్తి తీవ్ర గాయం..

ప్రమాదవశాత్తు చెట్లు కోసే మిషన్ తగిలి మండలంలోని బైరవునిపల్లి గ్రామానికి చెందిన కుంచం భిక్షం (40) అనే వ్యక్తికి తీవ్రగాయమైంది. గురువారం ఓ రైతుకు చెందిన చెట్లను కోస్తుండగా తెగినట్లు స్థానికులు తెలిపారు. ఈమేరకు క్షతగాత్రుడిని నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం నగరంలోని కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ వి.చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం సంఘ కార్యాలయంలో జరిగిన సంస్థ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ రక్తదాన శిబిరంలో యువకులు, విద్యార్థులు, స్థానిక పౌరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి సాధినేని జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సూర్య ప్రకాశ్‌రావు, డాక్టర్ బాలు, బ్లడ్ బ్యాంక్ పీఆర్‌ఓ దినేష్, జిల్లా వెంకటేశ్వర్లు, తాతా రాఘవయ్య, సంస్థ సభ్యులు గజేంద్రుల నాగేశ్వరరావు, మూలగుండ్ల శ్రీహరి, గట్టు మోహన్, ఉప్పలయ్య, సాయికుమార్, ఎండీ.గౌస్, అనాసి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

ఖమ్మం స్పోర్ట్స్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పాదం యోగా ఆర్గనైజేషన్, పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు శిక్షకురాలు సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఉంటుందని, పూర్తి వివరాలకు 95022 74000 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నేలకొండపల్లి: మండలంలోని నాచేపల్లి గ్రామంలో గ్రామ యువజన సంఘం ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన డివిజన్‌స్థాయి క్రికెట్ పోటీలను నాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు ముత్తినేని వీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయి వరకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మక్తాల రామకృష్ణ, మాజీ సర్పంచ్ మందడి రాజేష్, ముంద్ర నాగ ప్రసాద్, అమ్మ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

16న ఆలయ సప్తదశ వార్షికోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బైపాస్ రోడ్ విజయనగర్ కాలనీ శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం సప్త దశ వార్షికోత్సవాన్ని ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు మందిర నిర్వహణ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ బాధ్యులు చెప్పారు.

సీఐటీయూ ఆధ్వర్యాన ఆశావర్కర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశాలు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో 20 ఏళ్లుగా పని చేస్తున్న ఆశావర్కర్లకు ప్రభుత్వం పరీక్షలు పెట్టాలనే ఆలోచనను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆశా వర్కర్ల సమస్యలు, ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యాన ఆశాలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆలోచన ఆమోదయోగ్యం కాదని అన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి ఆరోగ్యం కోసం పని చేస్తున్న ఆశాలకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ప్రతీనెల 12వ తేదీ వరకు వేతనాలు ఇవ్వడం లేదని, ఆశాలకు నికరమైన వేతనం ఇవ్వాలని, పెండింగ్ బిల్లుల సమస్యలు పరిష్కరించాలని, సబ్ సెంటర్లలో ఆశాలకు విధులు కేటాయించొద్దని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ వీపీ గౌతమ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విష్ణు, సీపీఎం జిల్లా నాయకులు ఎస్.నవీన్‌రెడ్డి, రమ్య, మోహన్‌రావు, ఆశాల యూనియన్ జిల్లా కార్యదర్శి బి.అమల, పి.రమణ, రాణి, కమల, సమాదానం, సరోజిని, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ

నేలకొండపల్లి: రైతులకు విక్రయించే విత్తనాలు, ఎరువులను ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.విజయచంద్ర అన్నారు. గురువారం మండలంలోని చెన్నారం, మంగాపురంతండా, నేలకొండపల్లి గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు రశీదు ఇవ్వాలని, తప్పకుండా రికార్డు నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారిణి డి.అరుణకుమారి, ఏఈఓ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి



కట్టుకాచారంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుమలాయపాలెం ఐసీడీఎస్ ఏసీడీపీఓ కనకదుర్గ సూచించారు. మండలంలోని కట్టుకాసారాం గ్రామంలో గురువారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, తల్లులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడేళ్లు నిండిన వారిని కేంద్రంలో, ఐదేళ్లు నిండిన వారిని బడిలో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారంతో పాటు ప్రైవేట్‌కు దీటుగా ఆట, పాట, విద్యా బోధన కార్యక్రమాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, టీచర్స్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



ఎంపీఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: పంచాయతీ కార్మికులకు కలెక్టర్ ప్రత్యేక నిధులలో వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. గురువారం గ్రామ పంచాయతీ వర్కర్లకు వేతనాలు ఇవ్వాలని కోరుతూ.. ఎంపీఓ రాజేశ్వరీకి వినతిపత్రం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఆరు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని, వారికి ఉద్యోగ భద్రత లేకపోయిన వెట్టి చాకిరి చేస్తున్నారని వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గోను పుల్లయ్య, మీగడ సైదులు, కత్తుల భిక్షం, ఎల్లయ్య, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ డిస్కమ్ కార్యదర్శి టి.శేషగిరిరావు కోరారు. గురువారం నగరంలోని వైరారోడ్‌లో ఉన్న విద్యుత్ భవన్‌లో సంఘం ప్రాంతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జి.లక్ష్మీనరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పదోన్నతులు, కారుణ్య నియామకాలకు, ఉద్యోగాల భర్తీకి టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఉద్యోగుల డీఏ బకాయిలు, జేఎల్‌ఎంలకు సంబంధించిన 2011 ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ ప్రాంతీయ అదనపు కార్యదర్శి పి.సురేష్, జీవీఎస్‌ఎస్ శ్రీనివాస్, కిరీటా చారి, కృష్ణప్రసాద్, శ్రీధర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా 'కోడ్' ముసుగులోనే..



చేగొమ్మ రోడ్‌లో ముసుగు తొలగని వైఎస్సార్ విగ్రహం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన ఎన్నికల నియమావళిలో భాగంగా రాజకీయ నాయకుల విగ్రహాలు, పార్టీల దిమ్మెలకు అధికారులు ముసుగులు వేసిన సంగతి తెలిసిందే. కాగా, ఎన్నికలు ముగిసి, ఫలితాలు వచ్చి కోడ్ పూర్తయినప్పటికీ మండలంలో అక్కడక్కడా విగ్రహాలకు ముసుగులు తొలగించలేదు. దీంతో ప్రజలు, పార్టీల నాయకులు విస్మయం చెందుతున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని ముసుగులు తొలగించాలని కోరుతున్నారు.

– కూసుమంచి

దొరికినంత దోచుడే..!

రెట్టింపు ధరలకు స్టాంప్ పేపర్ల విక్రయాలు

- ప్రభుత్వం కమీషన్ ఇస్తున్నా మారని స్టాంప్ వెండర్ల తీరు
- కరువైన అధికారుల పర్యవేక్షణ
- ప్రజల జేబులకు చిల్లులు



రూ.50 విలువైన పేపర్

నేలకొండపల్లి: నిఘా నిద్రపోతుంటే.. దగా దండుకుంటుంది... అన్నట్లుగా మండలంలో నిబంధనలకు విరుద్ధంగా స్టాంప్ పేపర్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. ఏకంగా రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నా.. చేసేది లేక అవసరాలను బట్టి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. స్టాంపు వెండర్లపై పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇటీవల సంక్షేమ పథకాలు అమలు, విద్యార్థుల ఉపకార వేతనాలు, స్థిరాస్తి ఒప్పందాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు, రుణాలు పొందేందుకు స్టాంపు పేపర్ల వినియోగం బాగా పెరిగింది.దీంతో ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న స్టాంపు వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తూ దోచినకాడికి దండుకుంటున్నారు.

రూ.100 విలువైన స్టాంప్ పేపర్ రూ.200..

నేలకొండపల్లి మండల కేంద్రంలో ఉన్న స్టాంపు వెండర్లు రూ.50 విలువైన స్టాంప్ పేపర్‌ను రూ.100, రూ.100 విలువైన పేపర్లను రూ.200 వరకు విక్రయిస్తున్నారు. వినియోగదారుల బలహీనతలను పసిగట్టి స్టాంపు వెండర్లు పేపర్లను విక్రయించాల్సిన ధరకు అధికంగా వసూలు చేస్తున్నారు. దీంతో ప్రజలు జేబులకు చిల్లులు పడుతున్నాయి.

పర్యవేక్షణ కరువు..

నేలకొండపల్లి మండల కేంద్రంలో స్టాంపు వెండర్లపై పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వం వారికి కమీషన్ ఇస్తున్నా.. ఇష్టానుసారంగా విక్రయాలు చేపడుతున్నారు. గత శనివారం ఓ వ్యక్తి రూ.100 స్టాంప్ పేపర్లు కావాల్సి ఉండగా.. అవి అందుబాటులో లేకపోవడంతో రూ.50 పేపర్లను రెండింటిని కొని రూ.200 కట్టాల్సి వచ్చింది. ఇలా ప్రతీ రోజు జరుగుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా స్టాంపు పేపర్లను నిర్ణీత ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.